సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024

రైతు సమస్యలే ఎజెండాగా..



- 15న సంగారెడ్డి జిల్లాలో కేసీఆర్ బహిరంగ సభ
- ఇక్కడి నుంచే లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం?

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: గులాబీ బాస్ కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి రెడీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత అనారోగ్య సమస్యల కారణంగా ప్రజల్లోకి రాలేకపోయారు. కానీ ఇటీవల నీటి సమస్యలు, పంట పొలాలు ఎండిపోవడం వంటి సమస్యలపై స్వయంగా ఆయన ప్రజాక్షేత్రంలోకి వచ్చారు. అంతేకాకుండా లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించి బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటాలని కేసీఆర్ భావిస్తున్నారు. ఇందుకోసం ఉమ్మడి మెదక్ జిల్లాలో బహిరంగ సభ నిర్వహించాలని యోచిస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ బహిరంగసభను జిల్లాలో నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఈనెల 15న ఈ సభను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభానికి ముందే ఈ సభను జరపాలని ఆ పార్టీ భావిస్తోంది. ఈ సభను అందోల్ నియోజకవర్గంలో పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చింది. 161 జాతీయ రహదారి పక్కన సుల్తాన్‌పూర్ టోల్‌గేట్ సమీపంలో ఉన్న స్థలంలో ఈ సభను నిర్వహించేందుకు అనువైన దిగా గుర్తించారు. ఇటీవలే బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింత ప్రభాకర్, ఇతర ముఖ్యనేతలు ఈ స్థలాన్ని పరిశీలించారు. కేసీఆర్ ఇటీవల జిల్లాల పర్యటనలు చేస్తున్నారు. రైతుల సమస్యలే ప్రధాన జెండా పర్యటనలు ఉంటున్నాయి.

రెండు లోక్‌సభ స్థానాలు కవర్ అయ్యేలా..

జహీరాబాద్‌తో పాటు, మెదక్ లోక్‌సభ స్థానాలు కవరయ్యేలా ఈ సభను నిర్వహించాలని బీఆర్‌ఎస్ యోచిస్తోంది. ఈ మేరకు అందోల్ నియోజకవర్గం పరిధిలో ఈ సభను నిర్వహించడం ద్వారా ఇటు అందోల్‌తో పాటు, నారాయణఖేడ్, జహీరాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్లు, సంగారెడ్డి, నర్సాపూర్, మెదక్ అసెంబ్లీ స్థానాలు కవర్ అయ్యేలా బహిరంగ సభ నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

కేసీఆర్ జిల్లాల పర్యటనలు రైతుల సమస్యలే ఎజెండాగా కొనసాగుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభానికి కొద్ది రోజుల ముందే ఈ సభను నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఇక్కడి నుంచే ప్రారంభమవుతుందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.





రథోత్సవ వేళ నాచగిరిలో భక్తజన సందోహం

దివ్య విమాన రథంపై ఊరేగుతున్న స్వామివారు

దివ్యవిమాన రథంపై నారసింహుడు

హరిద్రాతీరంలో మార్మోగిన గోవిందనామం

వర్గల్(గజ్వేల్): తీర్థజనులతో నాచగిరి కిక్కిరిసింది. గోవింద నామంతో హరిద్రాతీరం మార్మోగింది. దివ్యవిమానరథంపై స్తంభోద్భవుడు లక్ష్మీనృసింహ స్వామివారు పురవీధులలో ఊరేగుతూ భక్తజనావళికి దర్శనమిచ్చారు. ఊరేగింపు భక్తజన హర్షధ్వానాలు, భాజాభజంత్రీలు, బ్యాండు మేళాలు, కోలాటాలు మధ్య ఉదయం 6 గంటలకు ప్రారంభమైంది. తూర్పు, దక్షిణ, పడమర ద్వారాల మీదుగా స్వామివారు పురవీధుల్లో ఊరేగుతూ గిరి ప్రదక్షిణ చేశారు. ఉత్తరద్వారం వద్దకు చేరుకున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, జిల్లాలు, పొరుగు రాష్ట్రం కర్ణాటక నుంచి భక్తులు పోటెత్తారు. ఈఓ అన్నపూర్ణ పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా జరిగిన ఈ మహోత్సవంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి స్వామివారి ఆశీస్సులు పొందారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, గౌరారం, ములుగు ఎస్‌ఐలు శివకుమార్, విజయకుమార్ పోలీసు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. రథోత్సవం అనంతరం అర్చకులు హోమం,పూర్ణాహుతి, చక్రవరి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు శతఘటాభిషేకం

నాచగిరి క్షేత్రంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం శత ఘటాభిషేకంతో ముగుస్తాయి. ఉగాది పర్వదినం పురస్కరించుకుని సాయంత్రం ఆస్థాన పంచాంగకర్త గోపాలకృష్ణశర్మ పంచాంగ శ్రవణం చేస్తారని ఆలయ ఈఓ తెలిపారు.



కాసుల గలగల

- జిల్లాలో లక్ష్యానికి మించి వ్యవసాయ మార్కెట్ల ఆదాయం
- అత్యధిక ఆదాయం హుస్నాబాద్.... అత్యల్ప ఆదాయం తొగుట
- గతేడాది రూ 30.48 కోట్లు... 2023-24 రూ 34.64 కోట్ల వసూళ్లు

సాక్షి, సిద్దిపేట: జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పంటల ఉత్పత్తి పెరగడంతో పలు మార్కెట్లకు ఆ శాఖ నిర్దేశించిన లక్ష్యానికి మించి ఆదాయం సమకూరింది. గతేడాది మార్కెట్లకు వచ్చిన ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొని మార్కెటింగ్ శాఖ జిల్లా పరిధిలోని 14 మార్కెట్లకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ 34.39 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా.... ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.34.64 కోట్లు మార్కెట్ ఫీజుల రూపంలో వసూలైంది. నిర్దేశించిన లక్ష్యం కంటే ఎక్కువ ఆదాయం వచ్చింది.

గతేడాది కంటే ..

2022-23కి గాను రూ 30.48 కోట్ల ఆదాయం రాగా 2023-24కి గాను రూ.34.64కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది కంటే రూ 4.16 కోట్ల ఆదాయం పెరిగింది. మార్కెట్ ఫీజులు, లైసెన్స్ రెన్యువల్స్, వ్యవసాయ శాఖ చెక్ పోస్టుల ద్వారా మార్కెట్లకు ఆదాయం వస్తోంది. సిద్దిపేట పట్టణంలో రైతు బజార్, సమీకృత మార్కెట్, మటన్, చికెన్, ఫిష్ మార్కెట్లతో పాటు గదుల అద్దెల ద్వారా, పశువుల సంత ద్వారా ఆదాయం సమకూరుతుంది. దీంతో సిద్దిపేట మార్కెట్‌కు ప్రతి ఏడాది ఆదాయం పెరుగుతూ వస్తోంది.



సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

మార్కెట్	2023-24 (రూ.లక్షల్లో)	2022-23 (రూ.లక్షల్లో)
సిద్దిపేట	449.86	342.54
చిన్నకోడూరు	212.02	145.52
నంగనూరు	120.91	168.63
తొగుట	61.40	85.65
దౌల్తాబాద్	139.44	169.16
కొండపాక	111.75	150.52
మిరుదొడ్డి	106.95	146.29
దుబ్బాక	276.41	174.20
బెజ్జంకి	300.38	174.92
హుస్నాబాద్	479.65	445.10
కొహెడ	167.13	120.43
గజ్వేల్	386.60	310.23
చేర్యాల	456.48	412.59
ఒంటిమామిడి	195.99	202.77

14 మార్కెట్లలో ఫీజుల రూపంలో..

జిల్లాలోని 14 వ్యవసాయ మార్కెట్లలో ఫీజుల రూపంలో అధికంగా డబ్బులను వసూలు చేసి హుస్నాబాద్ టాప్‌లో నిలవగా తక్కువ ఆదాయంతో తొగుట మార్కెట్ నిలిచింది. గతేడాది కంటే నంగనూరు, తొగుట, దౌల్తాబాద్, కొండపాక, ఒంటిమామిడి మార్కెట్లకు ఫీజుల రూపంలో ఆదాయం తగ్గింది. మిగతా మార్కెట్లలో గతేడాది కంటే ఎక్కువ ఆదాయం వచ్చింది., పౌరసరఫరాల సంస్థ ద్వారా వడ్లు, మార్క్‌ఫెడ్ ద్వారా పొద్దుతిరుగుడు గింజలు, సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు మార్కెట్ ఫీజులతో ఆదాయం మార్కెట్లకు వస్తోంది.

చెక్ పోస్టులు కట్టుదిట్టం చేశాం



జిల్లాలో వ్యవసాయ శాఖ చెక్ పోస్టలను కట్టుదిట్టం చేశాం. కార్యదర్శులందరూ సమష్టి కృషితో టార్గెట్ కంటే ఎక్కువగా రిచ్ అయ్యాం. రైతులు పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకొచ్చేలా ప్రోత్సహిస్తున్నాం.

నాగరాజు, మార్కెటింగ్ అధికారి

తొలి తెలుగు పండుగ ఉగాది



ఉగాది సామగ్రి కొంటున్న మహిళలు



మామిడి పండ్లు కోస్తున్న యువతి

- నేడు క్రోధి నామ సంవత్సరం ప్రారంభం
- పంచాగ శ్రవణానికి ప్రజలు సిద్ధం.. ముస్తాబైన ఆలయాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నూతన తెలుగు సంవత్సరం ప్రారంభానికి చిహ్నంగా జరుపుకొనే పండుగ ఉగాది. తొలి తెలుగు పండుగ కావడంతో ప్రజలు తమ ఇళ్లను మామిడి తోరణాలతో అలంకరిస్తారు. రంగురంగుల ముగ్గులతో లోగిళ్లను తీర్చిదిద్దుతారు. చిన్నాపెద్ద అందరూ ఉదయాన్నే లేచి తలస్నానాలు ఆచరించి, నూతన దుస్తులు ధరిస్తారు. అనంతరం దేవాలయాలకు వెళ్లి మహిళలు పూజలు చేస్తారు. ఉగాది పచ్చడికి అవసరమైన వేప పూవు, మామిడి కాయ, చింతపండు, కారం, ఉప్పు, బెల్లంలను వేసి సిద్ధం చేస్తారు. తీపి పులుపు కలయికలో ఉన్న పచ్చటిని రుచి చూసి మైమరిచిపోతారు. అయితే వాటిని తయారీకి అవసరమైన సామగ్రి కోసం తెచ్చేందుకు మార్కెట్‌కు వెళ్లిన మహిళలు, ప్రజలతో బజార్లు కిటకిటలాడాయి. అలాగే ఆటపాటలతో పండుగ రోజు ప్రతి ఇంట్లో సందడి వాతావరణం కనిపిస్తుంది. కాగా ప్రతి ఒక్కరూ క్షేమంగా ఉండాలని ప్రతి కుటుంబంలో సుఖశాంతులు కలగాలని ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటారు. ముఖ్యంగా పంచాగ శ్రావణం కోసం ఆలయాలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. వివిధ కుల సంఘాలు, రచయితల సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో పంచాగ శ్రవణ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఆర్యవైశ్య, వనిత క్లబ్, ఇతర మహిళా గ్రూప్‌ల ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలను నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు చేపట్టొద్దు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పోతారం శివారులో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను నిలిపేయాలని మండలంలోని నర్సింహులపల్లె గ్రామస్తులు, మహిళలు కోరారు. సోమవారం గ్రామ శివారులో ఉన్న ఫ్యాక్టరీ స్థలం వద్దకు చేరుకొని ఆందోళన నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన బోర్డును తొలిగించారు. విషయం తెలుసుకున్న వెంటనే సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్, బెజ్జంకి ఎస్‌ఐ కృష్ణారెడ్డి వారిని సముదాయించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఫ్యాక్టరీ పనులతో పర్యావరణం కలుషితమవుతుందన్నారు. పోలీసులు స్పందిస్తూ చట్టపరంగా వెళ్లి ఫ్యాక్టరీ పనులను ఆపుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే పలుచోట్ల ఇలాంటి ఫ్యాక్టరీలున్నాయన్నారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు

సిద్దిపేటకమాన్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచల సీతారామ చంద్రస్వామి కల్యాణ మహోత్సవ తలంబ్రాలను ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా ఇంటి వద్దకే అందజేస్తామని సిద్దిపేట డీఎం సుఖేందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. తలంబ్రాలను కావాలనుకునే భక్తులు రూ.151 చెల్లిస్తే తమ చిరునామాకే పంపిస్తామని పేర్కొన్నారు. డిపో నంబర్ 94412-05434లో ప్రయాణికులు సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశం ఈ నెల 18వ తేదీ వరకే ఉందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్నాతకోత్సవానికి రండి



గవర్నర్ రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ నీరజాప్రభాకర్

ములుగు(గజ్వేల్): గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను సోమవారం ములుగు.. కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బి. నీరజా ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. హైదరాబాద్‌లోని గవర్నర్ భవన్‌లో కలిసి.. ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ మూడో స్నాతకోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానించారు.

మెరుగైన సేవలకు ప్రాధాన్యం

సిద్దిపేటకమాన్: జిల్లా వైద్యారోగ్యశాఖ సిబ్బంది, వైద్యులు జిల్లా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో వైద్య సిబ్బందితో కలిసి ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సంవత్సరం నినాదం .. నా ఆరోగ్యం నా హక్కు.. అని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవించకుండా వ్యాధి నిరోధక టీకాలు సమయానికి అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

తాగునీటి కోసం ముందస్తు ప్రణాళికలు

ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ భారతి హోళికేరి

సిద్దిపేటరూరల్: వేసవి కాలం దృష్ట్యా జిల్లాలో సరాఫరా అయ్యే చివరి గ్రామం వరకు తాగునీరు అందించేలా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని సాగాలని రాష్ట్ర ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ భారతి హోళికేరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో తాగునీటి సరాఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ గ్రిడ్, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు తాగునీటి సరాఫరా క్రమ పద్ధతిలో జరుగుతుందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ఈనెల 15వ తేదీ లోపు పరిష్కరించుకోవాలన్నారు. అలాగే కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 08457230000 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి మాట్లాడుతూ మండల స్థాయి అధికారులందరూ అప్రమత్తంగా ఉండి తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు.

ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి వినతి

దుబ్బాక: నియోజకవర్గంలో నెలకొన్న తాగు సాగు నీటి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కలెక్టర్‌ను కోరారు. సోమవారం మను చౌదరిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాల్లో తాగునీరు సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) దేవకీ దేవి ఆదేశించారు. సోమవారం అక్కన్నపేట మండల పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

తాగునీటి అంతరాయంపై కంట్రోల్ రూం

హుస్నాబాద్: పట్టణంలో వేసవి కాలం దృష్ట్యా మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు.

ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తా

మాజీమంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ఇచ్చిన వాగ్దానాలను అసెంబ్లీలో నిలదీసి ప్రశ్నించే గొంతుకకు మీరు మద్దతు ఇవ్వాలి, లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ సీటు బీఆర్‌ఎస్ గెలిస్తే తాను మరింత గట్టిగా అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తా అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం స్థానిక కొండా భూదేవి గార్డెన్స్‌లో లోక్‌సభ ఎన్నికల సన్నాహకంలో భాగంగా బీఆర్‌ఎస్ విద్యార్థి, యువత, సోషల్ మీడియా వారియర్స్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను, వాగ్దానాలను విస్మరించిన విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. ఎంపీ స్థానాల్లో అత్యధికంగా బీఆర్‌ఎస్ విజయం సాధిస్తే, ప్రజల తీర్పుపై ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంటుందన్నారు. ఎన్నో ఏళ్ల కల సిద్దిపేట జిల్లా, అలాంటి ఈ జిల్లా ను రద్దు చేయాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. దీన్ని కాపాడుకుందామన్నారు. ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలన్నారు. రంగనాయక సాగర్ నీళ్ల సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట ఉద్యమ గడ్డ అని,కాంగ్రెస్, బీజేపీ అసత్య ప్రచారాలను నమ్మొద్దని సూచించారు. మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిని గెలిపించాలని కోరారు.

కనుల పండువగా మల్లన్న బ్రహ్మోత్సవాలు



మల్లన్నస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు



అగ్నిగుండాలను దాటుతున్న ఆలయ పూజారులు, భక్తులు

- 12 వారాలపాటు సాగిన జాతర
- అగ్నిగుండాలతో ముగింపు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు నిర్వహించిన అగ్నిగుండాలతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరై అగ్నిగుండాలను దాటారు. ఉదయం 5 గంటలకు గురుపూజ, బలిహరణ, అగ్నిగుండాల ప్రవేశం, విజయోత్సవం , ఆలయ ఈఓ, అర్చకులు, పాలక మండలి ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణ వేదిక ప్రాంగణంలో 7.15 గంటలకు వీరభద్ర ప్రస్తాయం, భద్రకాళి పూజ, 12 గంటలకు అగ్నిగుండాల ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు స్వామి అమ్మవార్లకు ఏకాదశ రుద్రభిషేకం, మహామంగళహారతి, మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

ఏటా మార్గశిర మాసం చివరి ఆదివారం (సంక్రాంతి తర్వాత వచ్చే ఆదివారం)తో మొదలై పాల్గుణ మాసం చివరి ఆదివారం (ఉగాది ముందు వచ్చే ఆదివారం) వరకు మూడు నెలల పాటు జాతర వైభవోపేతంగా జరుగుతుంది. ఈ ఏడాది కూడా 12 వారాలు జాతర కొనసాగగా సుమారు 10 నుంచి 15 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. దర్శనానికి తెలంగాణ భక్తులతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, చత్తీస్‌గఢ్ భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చి మొక్కులు చెల్లించారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాలు..

ఆలయ వర్గాలు వీరశైవ ఆగమ శాస్త్ర పద్ధతిలో అగ్నిగుండాల కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా పంచ పల్లవాలైన మర్రి, మేడి, మామిడి, మోదుగు, జమ్మి చెట్ల కర్రలు తెచ్చి ఒక చోట పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. పంచ పల్లవాలతో అగ్ని గుండాన్ని తయారు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు వీరభద్రుని విజయఖడ్గంతో అగ్నిగుండం దండకాలు వేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మొదట అగ్ని గుండం ప్రవేశం తర్వాత అధికారులు, భక్తులు వాటిని దాటి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమం అల్లంపల్లి కెంపిన మఠాధీశ్వరులు చెన్న బసవ ప్రభు మహాస్వామి ఆధ్వర్యంలో జరుగగా కేథార్‌నాథ్ దేవాలయ ప్రధానార్చకులు శివలింగ స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అగ్నిగుండాలను దాటిన వారిలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు, అధికారులున్నారు.

పొద్దుతిరుగుడు గింజలను కొనాలి

తొగుట(దుబ్బాక): పొద్దు తిరుగుడు గింజలు కొనుగోలు చేయకుంటే ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామని పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణారెడ్డి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ అధికారికి పొద్దుతిరుగుడు రైతులతో కలిసి ఆయన సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 రోజుల క్రితం స్థానికంగా పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. 10 రోజులపాటు సజావుగా సాగిన కొనుగోలు తర్వాత ప్రభుత్వం నిలిపేసిందన్నారు. మార్కెట్‌లో సుమారు 15 లారీల గింజలు నిల్వలున్నాయని తెలిపారు. మండల రైతులతోపాటు మిరుదొడ్డి, దుబ్బాక, దౌల్తాబాద్, గజ్వేల్ మండలాల రైతులు తెచ్చిన పొద్దుతిరుగుడు నిండుగా ఉన్నాయన్నారు. వరికోతలు ప్రారంభం కావడంతో వడ్లు ఎక్కడ పోయాలని నిలదీశారు. పొద్దుతిరుగుడు, వడ్లు తీసుకు వచ్చిన రైతుల మధ్యన గొడవలకు దారితీసే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి పొద్దుతిరుగుడును గింజలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు ప్రారంభించాలని లేకుంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, ఏఎంసీ మాజీ చైర్మన్ కనకయ్య, మాజీ డైరెక్టర్లు యాదగిరి, రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, కనకయ్య, సుభాష్ గౌడ్, ఆయా గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి


కిషన్ రెడ్డితో విష్ణువర్ధన్ రెడ్డి

సంగారెడ్డి టౌన్ : న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎనిమిదవ సారి సంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైనందున ఆయన్ను కిషన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. విష్ణువర్ధన్‌రెడ్డి ఇంకా ఉన్నతమైన స్థాయికి వెళ్లాలని, అలాగే న్యాయవాదుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

చర్చనీయాంశంగా చిరుత హత్య

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాస్
- రెండు టీమ్‌లుగా దర్యాప్తు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దుబ్బాకటౌన్ : దౌల్తాబాద్ మండల కేంద్రం నుంచి చేగుంటకు వెళ్లే అడవి శివారులో వేటగాళ్ల చేతిలో చిరుత హత్యకు గురైన ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. చిరుత కళేబరాన్ని వేటగాళ్లు దహనం చేసిన ప్రదేశాన్ని సోమవారం జిల్లా అటవీ శాఖ అధికారి కొత్తపల్లి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనిమిది మందితో కూడిన రెండు ఫారెస్టు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి ఆధారాలు సేకరిస్తున్నామన్నారు. త్వరలోనే పూర్తి ఆధారాలతో నిందితులను పట్టుకుంటామన్నారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి సందీప్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో సైబర్ మోసం

- రూ.16,75,750 పోగొట్టుకున్న బాధితురాలు
- మరో ఘటనలో రూ.3,24,500

సిద్దిపేటకమాన్: పార్ట్ టైం ఉద్యోగం, బ్యాక్ డోర్ ఉద్యోగాల పేరుతో వచ్చిన లింకులను ఓపెన్ చేసిన ఇద్దరు యువతులు రూ.20,00,250 పంపించి సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయారు. ఈ ఘటన సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో చోటు చేసుకుంది. సిద్దిపేట సీపీ అనురాధ వివరాల ప్రకారం .. సిద్దిపేట పట్టణానికి చెందిన యువతి ఆన్‌లైన్‌లో ఓ లింకులో తన వివరాలు నమోదు చేయగా గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి కాంగ్నిజెంట్ కంపెనీలో బ్యాక్ డోర్ ఉద్యోగం ఉందని చెప్పి నమ్మించాడు. ఆ మాటలు నమ్మిన బాధితురాలు ఆన్‌లైన్‌లో పలు విడతలుగా మొత్తం రూ.16,75,750 పంపించింది. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేసింది. మరో ఘటనలో ఓ మహిళ హోటల్ రివ్యూ ద్వారా సులభంగా డబ్బులు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి తెలిపిన మాటలు నమ్మింది. ఆన్‌లైన్‌లో మూడు విడతలుగా రూ.3,24,500 పంపించింది. అనంతరం ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో జాతీయ హెల్ప్ లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేసింది.

రెండు సంపుటాలు సంతోషనీయం

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఒకే సెమినార్‌లో రెండు సంపుటాలుగా పుస్తకాలను రూపొందించే అవకాశం రావడం సంతోషంగా ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) చరిత్ర విభాగం అధిపతి కొలిపాక శ్రీనివాస్ అన్నారు. గత నెల 16, 17ల్లో డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు సామాజిక శాస్త్రాల సాంస్కృతిక అధ్యయనం అనే అంశం పై నిర్వహించారు. దీనిపై ప్రజెంటేషన్ ఇవ్వగా ఇప్పుడు పుస్తక రూపంలో తీసుకువచ్చారు. సోమవారం డిగ్రీ కళాశాలలో సమీక్ష జరిగింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, పరీక్షల విభాగం సీఓఈ డాక్టర్ గోపాల సుదర్శనం, పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ అయోధ్య రెడ్డి, ఐకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, ఇంగ్లిష్ విభాగాధిపతి శ్రీనివాస్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రాణి, సామాజిక శాస్త్రాల కన్వీనర్ డాక్టర్ మల్లేశం, అధ్యాపకులు రాజు, శ్రద్ధనందం, మదన్మోహన్, శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, మహేందర్ రెడ్డి, మహేష్, గురుమూర్తి, హరిబాబు, చరిత్ర అధ్యాపకులు కొండల్ రెడ్డి, భిక్షపతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


అందాల జాడ.. అభివృద్ధి ఏడ?

ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా పోచారం అభయారణ్యం మాత్రం పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. పోచారం జలాశయం ప్రకృతి సౌందర్యాలకు పుట్టినిల్లు. ఇక్కడ సహజ సిద్ధంగా ఏర్పడిన అభయారణ్యంతోపాటు పోచారం డ్యాం, ఆహ్లాదకరమైన వాతావరణం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తుంటాయి. ఈ ఫారెస్ట్‌లో జింకలు, అడవిపందులు, సాంబార్లు, నెమళ్లు, రకరకాల పక్షులు కనిపిస్తాయి. అయితే పోచారం పర్యాటక అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలు ముందుకు సాగడం లేదు. దీంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

హవేళిఘణాపూర్ (మెదక్)

కనిపించని పోచారం పర్యాటక శోభ

- నిర్వహణ లేక శిథిలావస్థలో భవనాలు
- స్థలం సేకరించినా సాగని పనులు
- నాయకులు, అధికారులు సందర్శన
- ప్రభుత్వాలు మారినా అభివృద్ధి శూన్యం
- పర్యాటకులకు వసతులు కరువు


పోచారం అభయారణ్యం

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎన్నో ప్రాంతాలు పర్యాటకంగా అభివృద్ధి చెందినా మెదక్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పోచారం ప్రాంతం అభివృద్ధి చెందడం లేదు. దాదాపు వందేళ్ల కిందట 13 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పోచారం అభయారణ్యం ఏర్పాటు అయ్యింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేస్తామని చెప్పే పాలకులు తప్ప చేసిన వారు ఎవరూ లేరు. సమైక్యాంధ్ర పాలనలో.. నిర్లక్ష్యానికి గురైతే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కూడా కాగితాలకే పరిమితమై ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది.

ఎంతో మంది ప్రముఖులు పర్యటన

పోచారం డ్యామ్‌తోపాటు, పోచారం అభయారణ్యంను అప్పటి అటవీ శాఖ మంత్రి జోగురామన్న, మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు గత ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి, అటవీశాఖ ముఖ్యకార్యదర్శి రాజేశ్వర్ తివారి, అటవీశాఖ సీసీఎఫ్ అరుణ్ గోబ్రియల్, శోభ, హరితహారం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ పర్యటించి ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. త్వరలోనే అభివృద్ధికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పినా అభివృద్ధి చేస్తామన్న ఆ కల నేటికి నిజం కాలేదు.

ఈ ప్రభుత్వంలోనైనా..

ఎంతో పర్యాటక చరిత్ర కలిగిన పోచారం అభయారణ్యం, పోచారం డ్యామ్ అందాలు వర్ణనాతీతం. వందేళ్ల క్రితం నిర్మించిన భవనాలు ఇప్పటికి చెక్కుచెదర్లేదు. నిర్వాహణ లేకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయింది. పర్యాటకులు వచ్చినా వారికి అవసరమైన తాగునీరు, ఇతర వసతులు లేకపోవడంతో చెట్లకింద వంటలు చేసుకొని వెళ్తున్నారు. పోచారానికి మెదక్ జిల్లాతోపాటు కామారెడ్డి, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి సెలవు రోజుల్లో అధికంగా పర్యాటకులు వస్తుంటారు. గతేడాది రెండు బోట్లు ఏర్పాటు చేశారు. ఏడాది పాటు పర్యాటకుల జలవిహారం సాగింది. ఆ తర్వాత రెండు పడవలు పాడవ్వడంతో మూలకు చేరాయి. ఇప్పటి వరకు వాటి మరమ్మతులను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పటించుకోవడం లేదు. అలాగే సరస్సులో హరిత రెస్టారెంట్ ఏర్పాటు చేస్తామని చెప్పినా అది ఉత్తి మాటేగా మిగిలిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అయినా మెదక్ సమీపంలో ఉన్న ఈ ప్రాంతంను అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు, పర్యాటకులు కోరుతున్నారు.


నిర్వహణ లేక శిథిలావస్థకు చేరిన గెస్ట్‌హౌస్


వందేళ్లు పూర్తయినా చెక్కు చెదరని కట్టడం

స్థలం సేకరించినా..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోచారం అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని చెప్పిన అప్పటి మంత్రి హరీశ్‌రావు మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి బీఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు అధికారంలో ఉన్నా పోచారం కోసం ఎలాంటి నిధులు కేటాయించలేదు. కేవలం పోచమ్మ డ్యాం వైపు ఉన్న గుట్టపై మట్టిపోయించి చేతులు దులుపుకున్నారు. గతేడాది మెదక్- కామారెడ్డి జిల్లాలకు చెందిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పర్యాటకరంగ అభివృద్ధి కోసం స్థలాన్ని సేకరించాలని ఆదేశించగా స్థలం సేకరించారు. అనంతరం ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకో లేదు.


భూ సేకరణ చేస్తున్న అధికారులు

ప్రతిపాదనలు పంపాం



పోచారం డ్యామ్ శివారులో పర్యాటకరంగ అభివృద్ధికి 25 ఎకరాలు భూమిని గుర్తించాం. ఇందులో మధ్యలో ఉన్న సరస్సు, గెస్ట్ హౌస్ పరిసరాల ప్రాంతంలో మొత్తం కలిపి 25 ఎకరాలు సేకరించి ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే అభివృద్ధి పనులు చేపడుతాం.

– నారాయణ, తహసీల్దార్


యంత్రాల వినియోగంపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

సాగులో యంత్రాల వినియోగంతో..

- ఖర్చు, సమయం ఆదా
- కేవీకే శాస్త్రవేత్త ఎం.శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): వ్యవసాయంలో యంత్రాలను వినియోగించడం వల్ల ఖర్చు, సమయం ఆదా కావడంతోపాటు కూలీల సమస్య తీరుతుందని కేవీకే శాస్త్రవేత్త, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండలంలోని తునికి వద్ద గల డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో సాంకేతిక వారోత్సవాల్లో ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా జిల్లాలోని పలు గ్రామాల ఎస్సీ రైతులకు సాగులో శిక్షణ ఇచ్చారు. యంత్రాల వినియోగం, పంటమార్పిడి, కూరగాయల సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంలో పెద్ద రైతులతోపాటు చిన్న సన్నకారు రైతులు చిన్నచిన్న యంత్రాలను ఉపయోగించవచ్చన్నారు. కూరగాయలు, పండ్ల తోటలు, కంది, పత్తి, మొక్కజొన్న పంటలో చిన్న ట్రాక్టర్‌తో దున్నడం ద్వారా కలుపు నివారణ అవుతుందన్నారు. ఒక్క రోజులో ఒక మనిషి మూడు ఎకరాల వరకు కలుపు తొలగించవచ్చన్నారు. దీంతో వేరు వ్యవస్థలో ఉత్తేజం వస్తుందన్నారు. అనంతరం వ్యవసాయ యాంత్రీకరణ శాస్త్రవేత్త ఉదయకుమార్ మాట్లాడుతూ సాగులో వినియోగించే చిన్న చిన్న యంత్రాలను వాడే విధానం గురించి రైతులకు క్షేత్రస్థాయిలో వివరించారు. కార్యక్రమంలో కేవీకే హెడ్, శాస్త్రవేత్త నల్కర్, శాస్త్రవేత్తలు శ్రీకాంత్, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయాలి

- రూరల్ సీఐ శ్రీను
- నారాయణరావుపేట ఫ్లాగ్‌మార్చ్


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

సిద్దిపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీను అన్నారు. సోమవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో కేంద్ర బలగాలు సీఐఎస్ఎఫ్, పోలీస్ సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ శ్రీను మాట్లాడుతూ.. ఏదైనా సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1950కి ఫోన్ చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు గానీ, అభ్యర్థులకు సంబంధించిన వ్యక్తులు గానీ ఓటు వేయాలని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే, డబ్బులు ఆశ చూపి ప్రలోభ పెట్టినా, మద్యం, డబ్బులు ఓటర్లకు సరఫరా చేసినా యువకులు స్పందించి సీ-విజిల్ యాప్ ద్వారా ఫొటోలు, వీడియోలు తీసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ అపూర్వ రెడ్డి, బెజ్జంకి ఎస్ఐ కృష్ణారెడ్డి, సర్కిల్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలతో నష్టపోతే..

- జిల్లా వినియోగదారుల ఫోరమ్‌కు ఫిర్యాదు చేయాలి
- న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ లక్ష్మీశారద


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న లక్ష్మీశారద

హవేళిఘణాపూర్(మెదక్): నాసిక విత్తనాలు కొనుగోలు చేసి మోసపోయిన బాధిత రైతుకు తమ తరపున న్యాయం చేస్తామని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఛైర్మన్ లక్ష్మీశారద అన్నారు. సోమవారం మెదక్ మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోతే జిల్లా వినియోగదారుల ఫోరమ్‌కు ఫిర్యాదు చేస్తే రైతులకు తగిన నష్ట పరిహారంతోపాటు సమస్యను పరిష్కరిస్తామన్నారు. రూ.3 లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సేవలందించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో పరిష్కారం కాని కేసులు లోక్ అదాలత్‌కు వస్తే పరిష్కరిస్తామన్నారు. అనంతరం మైనర్లు వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలకు వారి తల్లిదండ్రులే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్లు సిద్దాగౌడ్, సిద్ధిరాములు, మధుకిరణ్, శారద, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇంటి నుంచి వెళ్లి.. చెరువులో శవమై తేలి

స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి


దేవానందం(ఫైల్)

దుబ్బాకరూరల్: చెరువులో గల్లంతైన వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అప్పనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన ఆశమ్మల దేవానందం(38) ఆదివారం రోజు ఊరిలో పని ఉందని చెప్పి ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన గుండెల ప్రశాంత్ ఉదయం పదిన్నర గంటల సమయంలో నీ భర్త అప్పనపల్లిలోని లొద్ది కుంట చెరువులో స్నానం చేయడానికి వెళ్లి మునిగి పోయాడని మృతుడి భార్య వజ్రవ్వకు ఫోన్ చేసి తెలిపాడు. వెంటనే కుటుంబ సభ్యులు చెరువు వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీస్‌లు, ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లు రాత్రి వరకు చెరువులో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం దేవానందం మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. మృతుడి భార్య వజ్రవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

దుబ్బాకటౌన్ : అక్రమంగా ఓ దుకాణంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, దౌల్తాబాద్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారుల వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన పబ్బ అశోక్ తండ్రి శంకరయ్య షాపులో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచాడు. నమ్మదగిన సమాచారం రావడంతో తనిఖీలు చేసి బియ్యం గుర్తించాం. వెంటనే బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య

సంగారెడ్డిటౌన్: గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైన ఘటన పట్టణ పరిధిలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని ఓ షాపు సమీపంలో 55 నుంచి 60 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తిని ఎవరో తలపై తీవ్రంగా కొట్టి హత్య చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు సిమెంటు రంగు ప్యాంటు, ముదురు ఎరుపు రంగు షర్టు ధరించి ఉన్నాడు. క్లూస్ టీంతో వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అదే విధంగా నలుపు, తెలుపు గీతలతో కూడిన హాఫ్ స్వెటర్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి ఎడమ చేతిపై గాలన్న అనే పచ్చబొట్టు ఉందన్నారు. ఎవరికైనా తెలిస్తే సంగారెడ్డి ఎస్పీ 87126 56706, రూరల్ సీఐ 87126 56719, ఎస్ఐ 87126 56746 నంబర్లకు సంప్రదించాలని వివరించారు.

భర్తను చంపిన భార్య అరెస్ట్

మర్కూక్(గజ్వేల్): భర్తను చంపిన భార్యను మర్కూక్ పోలీసులు అరెస్ట్ చేశారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి సోమవార తెలిపిన వివరాల ప్రకారం మర్కూక్ మండలం గణేశ్‌పల్లి గ్రామానికి చెందిన చీకోటి రాజు తన తండ్రి చీకోటి మల్లేశంపై ఈ నెల 2వ తేదీన అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా మల్లేశం రెండవ భార్య పుష్పను అదుపులోకి తీసుకొని విచారించగా నిజం ఒప్పుకుంది. ఈ నెల 1వ తేదీన మల్లేశంకు ఫిట్స్ రాగా ఎటువంటి మందులు ఇవ్వలేదని, మళ్లీ రాత్రి 10 గంటల సమయంలో ఫిట్స్ రాగా కోపంతో నెట్టివేయడంతో మంచానికి గుద్దుకొని చనిపోయాడని నిందితురాలు తెలిపింది. సోమవారం ఆమెను అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. వీరి వెంట మర్కూక్ ఎస్ఐ మధుకర్‌రెడ్డి, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

మెరుగైన వైద్యం అందిస్తాం

- డీఎంహెచ్ఓ శ్రీరామ్
- 'పడకేసిన పల్లె వైద్యం' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామని డీఎంహెచ్ఓ శ్రీరామ్ తెలిపారు. సోమవారం సాక్షిలో ప్రచురితమైన 'పడకేసిన పల్లె వైద్యం' అనే కథనానికి డీఎంహెచ్ఓ స్పందించారు. స్టాఫ్ నర్సులు డిప్యూటేషన్‌తోపాటు మరి కొందరు రెగ్యులర్ జాబ్ రావడంతో కొరత ఏర్పడిందన్నారు. జిల్లాలో 72 మంది స్టాఫ్ నర్సులు రెగ్యూలర్ జాబ్‌కు సెలక్ట్ అవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లారన్నారు. వీరి స్థానాల్లో 32 పోస్టులకు నూతన నియామకాల కోసం నోటిఫికేషన్ వేసినప్పటికీ ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. దీంతో ఏఎన్ఎంలతో పనుల సర్దుబాటు చేసినట్లు తెలిపారు.

డిప్యూటేషన్ వేసిన సిబ్బందిపై స్పందన కరువు

చిన్నశంకరంపేట పీహెచ్‌సీలో పని చేసే ఓ స్టాఫ్ నర్సు ప్రస్తుతం సర్దన పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తోంది. ఈమెను వెనక్కి పంపే విషయంలో డీఎంహెచ్ఓ స్పష్టత ఇవ్వలేదు. అలాగే రంగంపేటకు డిప్యూటేషన్‌పై వెళ్లిన మరో స్టాఫ్ నర్సు విషయం ప్రస్తావించలేదు. ఇక ల్యాబ్‌టెక్నీషన్ విషయంపై కూడా స్పందించలేదు. ముఖ్యంగా జిల్లాలో 24 గంటల సేవలందించాలనే విషయంలోనూ డీఎంహెచ్ఓ స్పందించాల్సిన అవసరం ఉంది.

మొర్రి పండ్ల కోసం చెట్టెక్కగా..

- విద్యుదాఘాతంతో యువకుడు మృతి
- పండుగ పూట విషాదం


రవి కిషోర్(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): మొర్రి పళ్ల కోసం చెట్టెక్కిన యువకుడు కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన హవేళిఘణాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన బాజ పుష్ప, రవీందర్ దంపతులు ఇద్దరు కుమారులతో కలిసి జీవనోపాధి కోసం మెదక్ పట్టణంలో ఉంటూ పాత ఇనుప సామగ్రి దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు బాజ రవికిషోర్(18), చిన్న కుమారుడు జీవన్ కలిసి మెదక్ నుంచి ఉగాది పండుగ కోసం స్వగ్రామం బూర్గుపల్లికి బైక్‌పై వస్తున్నారు. మార్గమధ్యలో మండల పరిధిలోని శాలిపేట శివారులోకి రాగానే మొర్రి పండ్ల చెట్టు కనిపించింది. పండ్లు తెంపేందుకు రవి కిషోర్ చెట్టు ఎక్కాడు. చెట్టు కొమ్మపై ఉన్న విద్యుత్ వైరు గమనించకుండా ఎక్కడంతో కరెంట్‌షాక్‌కు గురై కింద పడిపోయాడు. వెంటనే తమ్ముడు జీవన్ కుటుంబీకులకు సమాచారం అందించగా 108 అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ పోషణలో కీలకపాత్ర పోషించే పెద్ద కుమారుడు మృతి చెందడంపై తల్లిదండ్రులు కన్నీ మున్నీరుగా విలపించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని వడక్‌పల్లికి చెందిన ఒగ్గు జిత్ కుమార్(35) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఐదేళ్ల కిందట భార్య గొడవపడి తల్లి గారి ఇంటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో మద్యానికి బానిసైన జిత్ కుమార్ ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోమవారం మృతుడు తండ్రి ఒగ్గు చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య ఇంటికి రావడం లేదని..

భార్య ఇంటికి రావడం లేదని మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ మల్లారెడ్డి నగర్‌కు చెందిన మంగలిపేట కృష్ణ(33) వాచ్‌మెన్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మార్చి 27వ తేదీన కృష్ణ తన మరదలి వివాహం ఉండటంతో అత్తగారింటికి వెళ్లి మరుసటి రోజు ఇంటికొచ్చాడు. పెళ్లి నుంచి తొందరగా ఎందుకొచ్చావని కుటుంబ సభ్యులు అడుగగా భార్యకు, తనకు గొడవ జరిగిందని అందుకే వచ్చానని చెప్పాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి కృష్ణ అపార్ట్‌మెంట్‌లో ఉండే తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అపార్ట్‌మెంట్ వాసులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. భార్య ఇంటికి రావడం లేదని సోమవారం మృతుడి తండ్రి నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ తీరును ప్రజల్లో ఎండగడుతాం

ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ : అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ తీరును ప్రజల్లో ఎండగడుతామని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి నేడు ఆచరణలో విఫలమైందన్నారు. రైతుబంధు రూ.15వేలకు పెంపు, ఆసరా పింఛన్లు రూ.4వేలకు పెంపు, 2లక్షల రుణమాఫీ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికలకు జగదేవ్‌పూర్ మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులను సమాయత్తం చేస్తూ ఈ నెల 11న జగదేవ్‌పూర్‌లోని కేసీరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జగదేవ్‌పూర్ మండల సహకార సంఘం ఛైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మాజీ ఆత్మ కమిటీ ఛైర్మన్ రంగారెడ్డి, జగదేవ్‌పూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డి, నరేశ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

రూ.25 వేలు నష్ట పరిహారం అందించాలి

తూప్రాన్ : రాష్ట్ర వ్యాప్తంగా పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ. 25 వేలు నష్ట పరిహారం తక్షణమే అందజేసి ఆదుకోవాలని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఎండిన పంట పొలాలను పరిశీలించారు. అదే విధంగా ఐదు రోజుల కింట ఆత్మహత్య చేసుకున్న గ్రామానికి చెందిన బట్టికాడి రాజుగౌడ్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణగౌడ్, ఆంజనేయులుగౌడ్, స్వామి, కృష్ణారెడ్డి, చంద్రం, రాజు తదితరులు పాల్గొన్నారు.


ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి